

పాటలతో ప్రజలను ఏకతాటిపైకి తెచ్చారు 10లో▸

ప్రజా కవి గద్దర్ పాడిన పాటలు ప్రజలను ఉద్యమంలో ఏకతాటిపైకి తీసుకురావడంలో ముఖ్య భూమిక పోషించాయని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు.



గోండిలిపి పండితుడు మృతి

గోండిలిపి పండితుడు కోట్నాక్ జంగు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. గుంజాల గ్రామంలోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచాడు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని ఆరవ వార్డులో గల వాల్మీకి నగర్ కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 49 వార్డుల్లో అనేక రకమైన సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా డ్రెయినేజీ, రహదారుల నిర్మాణం, తాగునీటి సరఫరా వంటి సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి దశలవారీగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.320 కోట్ల నిధులు సరిపోవని, రాష్ట్ర ప్రభుత్వం సైతం మరిన్ని నిధులు కేటాయించేలా పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దయాకర్, భూమారెడ్డి, భరత్, ముకుందరావు, రాజు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.


సనాతన హిందూ ఉత్సవ సమితి కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఆదిలాబాద్: సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం గోపాలకృష్ణ మఠంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శిగా గెడెం మాధవ్, కోశాధికారిగా పడకంటి సూర్యకాంత్ కార్యనిర్వాహక కార్యదర్శిగా రేణిగుంట్ల రవీందర్, ఉపాధ్యక్షులుగా సామనపల్లి నరసింహులు, నర్సోజి మురార్కర్, కొటికె రాజు, లోలపు శ్రీనివాస్, కృష్ణ గౌడ్, లక్ష్మీకాంత్ బరాదే, సంయుక్త కార్యదర్శులుగా కొత్తపల్లి సంజీవ్, బెదోడ్కర్ సంతోష్, మాదాస్తు సంతోష్, ఎన్నవార్ రాజు, గౌరువార్ సతీష్, పొట్టిపెల్లి విజయ్, సలహాదారులుగా మీసాల స్వామి, పూసం ఆనంద్ రావు, గంగాధరయ్య, మహిపాల్, బాలాజీ సింగ్ ఠాకూర్, వేముల అశన్న, ఆసూరి హనుమాండ్లు యాదవ్, అమరేందర్, కోరెడ్డి పార్థసారథి, గౌరవ సభ్యులుగా మెనగంటి ప్రకాష్, పాశం రాఘవేంద్ర, ఉరాడే సుభాష్, వెంకట్ రెడ్డి, సతీష్ మిట్టల్, బాశెట్టి గజేందర్, వెంకటేశ్, దశరథ్, జనగం దినకర్, సంతోష్ పుల్లెవార్, న్యాయ సలహాదారులుగా బిపిన్ కుమార్ పటేల్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి వ్యవహరించారు.

హిందీ భాషాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న సుకుమార్ పెట్కులే

ఆదిలాబాద్‌రూరల్: హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తానని హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో ఆదివారం జిల్లాస్థాయి హిందీ దినోత్సవ వారోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ సేవలో హిందీ భాష సమితి ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. హిందీ ప్రేమికులు, హిందీ ఉపాధ్యాయులు దీనికి అండదండగా నిలిచి సహాయ సహకారాలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందీ భాష సేవా సమితి కార్యవర్గ సభ్యులు, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ ద్రోణాలే, కోశాధికారి చంద్రశేఖర్ అంబేకర్, ఉపాధ్యక్షుడు సాంబన్న షిండే, సంయుక్త కార్యదర్శి జావేద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

పెట్టిందే తిను.. అదే మెనూ

జిల్లా కేంద్రంలో గత నెలలో ఓ కేజీబీవీకి చెందిన ప్రత్యేక అధికారి బియ్యం ఆటోలో తరలిస్తుండగా కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు సెక్టోరియల్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఓ మోడల్ స్కూల్‌లో బియ్యం లేవని సాకు చెప్పి అక్కడికి తరలించినట్లు అధికారులను బుకాయించారు. అయితే అంతకుముందే ఆ పాఠశాలకు వేరే పాఠశాల నుంచి బియ్యం అప్పుగా తీసుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు.

- కేజీబీవీ విద్యార్థులకు అందని నాణ్యమైన భోజనం
- నీళ్లచారు.. పల్చని పాలే దిక్కు
- జాడలేని మటన్..
- కరువైన పర్యవేక్షణ.. పట్టించుకోని అధికారులు
- సరుకులను పక్కదారి పట్టిస్తున్న వైనం



జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో భోజనం చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్నా మా తీరు మారదు.. మేమింతే.. అన్న చందంగా మారింది కొన్ని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల పరిస్థితి. తల్లిదండ్రులను కోల్పోయిన వారు, పేద విద్యార్థులు చదివే కేజీబీవీల్లో నాణ్యమైన భోజనం పెట్టాల్సి ఉండగా కాసులకు కక్కుర్తిపడి నాసిరకం భోజనం అందిస్తుండడంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు పర్యవేక్షణ గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులకు ఏ విధంగా భోజనం పెడుతున్నారో తెలుసుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో అంతా ఇష్టారాజ్యం కొనసాగుతోంది. వారు పెట్టిందే తిను.. అదే మెనూ అన్న చందంగా మారింది. అంతేకాకుండా కొంతమంది ప్రత్యేక అధికారులు సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పూర్తి స్థాయిలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు ఎవరికీ చెప్పుకోలేక పెట్టిందే తినాల్సి వస్తోంది. మరి కొంతమంది ఆ భోజనం చేయలేక పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంటోంది.

వారు పెట్టిందే మెనూ..

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ఉదయం టిఫిన్‌తో పాటు పాలు, ఉడికించిన కోడిగుడ్లు, స్నాక్స్ అందించాల్సి ఉంది. ఆదివారం చపాతి, బగారా రైస్, వంద గ్రాముల చికెన్, పప్పు, మజ్జిగ పెట్టాల్సి ఉంది. అయితే చికెన్ ఒకట్రెండు ముక్కలు వేస్తున్నారు. కర్రీ నీళ్లలాగా ఉండడంతో వారు తినలేక పప్పు అన్నం తినడానికే మొగ్గు చూపుతున్నారు. నెలలో నాలుగు ఆదివారాలు, మరో రెండు బుధవారాలు విద్యార్థులకు చికెన్ వండిపెట్టాలి. రెండు సార్లు మటన్‌తో భోజనం పెట్టాల్సి ఉంది. అయితే కేవలం ఆదివారం మాత్రమే చికెన్ పెడుతుండగా, బుధవారాలు చికెన్, మటన్ జాడ లేకుండా పోయింది. ప్రతీ శనివారం విద్యార్థులకు స్వీట్ అందించాల్సి ఉండగా కొన్నింట్లో మాత్రమే స్వీట్లు పెడుతున్నారు. విద్యార్థులకు 150 మిల్లీలీటర్ల పాలు అందించాల్సి ఉండగా అవి సున్న పునీరులా ఉంటున్నాయని, అవితాగి రోగాల బారినపడే ప్రమాదముందని విద్యార్థులు పేర్కొంటున్నారు. అయితే ఈ పాలను చాలామంది తాగడానికి ఇష్టపడటం లేదని చెబుతున్నారు.

గతంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు..

జిల్లాలో 18 కేజీబీవీలు ఉన్నాయి. 4,800 మంది విద్యార్థినులు ఈ పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ విద్యాలయాల్లో నాణ్యమైన భోజనం అందించకపోవడంతో గతంలో పలుమార్లు ఫుడ్‌పాయిజన్ ఘటనలు సైతం చోటు చేసుకున్నాయి. ఆదిలాబాద్ అర్బన్ కేజీబీవీలో, భీంపూర్ కేజీబీవీ, నేరడిగొండతో పాటు పలు కేజీబీవీల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మాముళ్ల మత్తులో అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంతో విద్యార్థినులకు నాసిరకం భోజనం పెడుతున్నారనే చర్చ సాగుతోంది. ఒకపూటకు పెట్టాల్సిన ఆహార పదార్థాలను రెండు పూటలకు సరిపడా ఇవ్వడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కేజీబీవీలో ఉండాల్సిన కొంత మంది ప్రత్యేక అధికారులు వచ్చినప్పుడే రావడం షరా మామూలుగా మారింది. ప్రజాప్రతినిధుల అండదండలతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

మెనూ ప్రకారం భోజనం పెట్టేలా చూస్తున్నాం



కేజీబీవీల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టేలా చూస్తున్నాం. తనిఖీలు చేపడుతున్నాం. నాణ్యమైన భోజనం పెట్టేలా చర్యలు చేపడుతున్నాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.

– ఉదయశ్రీ, సెక్టోరియల్ అధికారి, ఆదిలాబాద్

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్సీ అమెర్ అలీఖాన్



కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ అమెర్ అలీఖాన్

కైలాస్‌నగర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ ఎమ్మెల్సీ అమెర్ అలీఖాన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సమక్షంలో లేఖర్ వాడ, బంగారిగూడ, యాపల్‌గూడ, యశ్వంత్ గూడ, జమ్ములధారి గ్రామాలకు చెందిన పలువురు వివిధ పార్టీలను వీడి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నడూలేనంతగా బలోపేతమవుతోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులే విజయఢంకా మోగిస్తారని, ఆదిశగా పార్టీ శ్రేణులు చిత్తశుద్ధితో ముందుకు సాగాలని సూచించారు. గరీబోళ్ల కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో ప్రతీ నాయకుడు, కార్యకర్త ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, గిమ్మ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుల సమస్య పరిష్కారానికి కృషిచేయాలి

ఆదిలాబాద్‌టౌన్: తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంజిత్ కుమార్ కోరారు. ఆదివారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రిమ్స్‌లో తలసేమియా, సికిల్‌సెల్ పేషెంట్ల కోసం రక్తం ఎక్కించే సెంటర్‌ను ప్రారంభించాలని కోరారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని వీరికి అమలు చేయాలని విన్నవించారు.

రక్తహీనత నివారణే 'పోషణ మిత్ర' లక్ష్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- ఉట్నూర్‌లో గిరిజన పోషణ మిత్ర పథకానికి శ్రీకారం



ఇప్పపువ్వు లడ్డూలు తినిపిస్తున్న మంత్రి సీతక్క



ఆదివాసీల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై కలెక్టర్లు, ఎస్పీ, ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థినుల్లో రక్తహీనత నివారణే పోషణ మిత్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గిరిజన పోషణ మిత్ర పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని 60 బాలికల ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన పోషణ మిత్ర పథకానికి ఐటీడీఏ పీవో శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. బాలికల్లో 6 శాతం కంటే తక్కువగా హిమోగ్లోబిన్ ఉంటే నెలసరి సమస్యలు అధికంగా ఉంటాయన్నారు. సీజనల్ కాలాల్లో సహజసిద్ధంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినాలని విద్యార్థినులకు సూచించారు. నా చిన్నతనంలో నేను సైతం రక్తహీనతతో బాధపడ్డానని గుర్తు చేశారు. రక్తహీనత నివారణలో భాగంగా బాలికలకు వారానికి రెండుసార్లు ఇప్పపువ్వు లడ్డూలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇప్పపువ్వు స్టాల్స్ పరిశీలించి విద్యార్థులకు లడ్డూలు అందించారు.

సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తాం..

ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న పరిస్థితులపై నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి సీతక్క అన్నారు. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో ఆదివారం ఆదివాసీ పెద్దలు, ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన ఘటన నేపథ్యంలో ఆదివాసీ పెద్దలు, ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులు, ఉద్యోగ, ఉపాధి, ఐటీడీఏకు నిధుల మంజూరు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గిరిజనులందరూ సంయమనం పాటించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు రాజర్షిషా, వెంకటేశ్ దోత్రే, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, అధికారులు, ఆదివాసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో ఒకే కుటుంబ ఆధిపత్యం

- ఎమ్మెల్సీ కోదండరాం

కైలాస్‌నగర్: పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో గత పదేళ్లలో ఒకే కుటుంబం ఆధిపత్యం సాగిందని, వారి దోపిడీని భరించలేకనే ప్రజలు ప్రజాపాలనను కోరుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన మరో ఎమ్మెల్సీ అమెర్ అలీఖాన్, గద్దర్ కూతురు వెన్నెలతో కలిసి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన కేసీఆర్ పాలనపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటు పడే కాంగ్రెస్ పార్టీని అన్ని ఎన్నికల్లోనూ ఆదరించాలని కోరారు. ఆదిలాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు రావాల్సిన అవసరముందన్నారు. తాను కాంగ్రెస్ సభ్యున్ని కాకపోయినా రాహుల్‌గాంధీ సిద్ధాంతాలకు మద్దతునిస్తున్నానన్నారు. అందుకే ఎమ్మెల్సీ పదవిని స్వీకరించానన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ విలాస్ పటేల్ సవాపురే, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఎస్టీయూ సంఘ భవనంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు మేనిఫెస్టో ఇన్‌చార్జి, మంత్రి శ్రీధర్‌బాబు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే విధంగా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 17 వేల మంది ఉండగా జిల్లాలో 543 మంది మెడికల్, పారామెడికల్, నాన్ పారామెడికల్, సపోర్ట్ స్టాఫ్ కౌన్సిల్ కింద పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఉద్యోగికి అర్హతలు ఉన్నాయని, ప్రత్యేక జీవో తీసుకొచ్చి తమను రెగ్యులరైజ్ చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దొంతుల ప్రవీణ్, కార్యదర్శి గీతేష్, సైకాలజిస్ట్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుషిపంచమి వేడుకలు

బజార్‌హత్నూర్: మండలంలోని చందునాయక్ తాండ జ్వాలాముఖి కలుబాబా మందిరంలో ప్రేమ్ సింగ్ మహరాజ్, దర్యాసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం రుషిపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ, మహారాష్ట్రలోని పలు గ్రామాల నుండి మథుర సమాజానికి చెందిన భక్తులు పాల్గొని డోలు, దాండియా నృత్యాలు చేశారు. కలుబాబా మందిరంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 10 వేల మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలరాం జాదవ్, ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, పోరెడ్డి శ్రీనివాస్, కానిందే రాజారాం, చిల్కూరి భూమన్న, కొత్త శంకర్, దీసి రమణ, అనిత కవీందర్, నానక్‌సింగ్, పద్వల్ రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ నగేష్‌ను సత్కరిస్తున్న ప్రేమ్‌సింగ్ మహరాజ్

గోపా నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న సత్యనారాయణగౌడ్

ఆదిలాబాద్‌టౌన్: గౌడ్ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘ భవనంలో ఆ సంఘం అధ్యక్షుడు ఆర్.రమేశ్‌చందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎ.సత్యనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పిడి సత్యనారాయణ గౌడ్, కోశాధికారిగా విలాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా జనార్దన్‌గౌడ్, కృష్ణకాంత్ గౌడ్, ఆర్.సతీష్ గౌడ్, సహాయ కార్యదర్శులుగా రంగు శ్యామ్‌రాజ్ గౌడ్, సుదర్శన్ గౌడ్, వై.రాజేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎ.రవిచందర్ గౌడ్, ఎస్. శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రతినిధులుగా కోల చంద్రప్రకాష్ గౌడ్, జి.ప్రదీప్ కుమార్‌గౌడ్, కోడూరి భూపతి గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎ.లక్ష్మీనారాయణ గౌడ్, నాందేవ్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా బి.గణేశ్‌గౌడ్, బి.నారాయణ గౌడ్, రమేశ్‌గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, ప్రేమ్‌కుమార్ గౌడ్, టి.రవీంద్రగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా నారాయణ, రమేశ్‌చందర్‌గౌడ్ వ్యవహరించారు.

మాధవరావు స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఎదులాపురం: కామ్రేడ్ బాశెట్టి మాధవరావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన బాశెట్టి మాధవరావు 11వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మాధవరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుది శ్వాస వరకు ప్రజా, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారని కొనియాడారు. ఆదిలాబాద్ పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక భూ పోరాటాలను ముందుండి నడిపి అనేక కాలనీలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అగ్రకులంలో జన్మించినా పీడితుల పక్షాన నిలబడి సర్వస్వం త్యాగం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపైన పోరాటాలను రూపొందించి పరిష్కారం దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంకా రాఘవులు, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అభినందనీయం

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు హిందూ సమాజ్ ఉత్సవ సమితి తోడ్పడటం అభినందనీయమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్‌లో హిందూ సమాజ్ ఉత్సవ సమితి సభ్యులు హనుమాన్లు, ఉదయ్, రమేశ్, సాగర్, వెంకటేష్, నర్సింగ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితికి మట్టి వినాయకుడిని పూజించాలని హిందూ సమాజ్ ఉత్సవ సమితి పిలుపునిచ్చి ప్రోత్సహించడాన్ని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం 36 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దండ నాయక ఉమాకాంత్, ప్రధాన కార్యదర్శి పెంటపర్తి ఊషన్న, పర్యావరణ శాఖ కన్వీనర్ రామగిరి శివకుమార్, జిల్లా నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గంగన్న, శ్రీధర్‌బాబు, విఠల్, సంజీవరెడ్డి, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

విద్యార్థులు భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో గణిత విజ్ఞాన మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిశు మందిరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలన్నారు. విలువలతో కూడిన విద్యను అందిస్తారన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకుని నూతన ఆవిష్కరణలు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, పాఠశాల అధ్యక్షుడు బజరంగ్, అగ్రికల్చర్ కళాశాల డీన్ శ్రీధర్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన మహిళకు ఉచిత శస్త్రచికిత్స

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, ఆయన సతీమణి డాక్టర్ రమ గిరిజన మహిళకు ఆదివారం ఉచిత శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని 2023 నుంచి దత్తత తీసుకుని ఆ గ్రామస్తులందరికీ అవసరమైన వైద్య సేవలను ఉచితంగా అందజేస్తున్నారు. ఇందులో భాగంగా అంకాపూర్‌కు చెందిన శోభకు గర్భసంచి చుట్టూ గడ్డ (ఫైబ్రైడ్‌యూట్రస్) అయ్యాయి. శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కాగా ఇప్పటివరకు గ్రామంలోని 150 మంది గ్రామస్తులకు ఉచితంగా వైద్యసేవలు అందించినట్లు వివరించారు.

కలప దుంగలు పట్టివేత



కలప దుంగలను కొలుస్తున్న అధికారులు

కడెం: మండలంలోని కల్లెడ నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న కలప దుంగలను ఆదివారం పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్వో గీతారాణి తెలిపారు. ఆమె కథనం ప్రకారం..పక్కా సమాచారంతో డీఆర్వో సిద్దార్థ, సిబ్బందితో కలిసి పాండ్వపూర్ వద్ద ఉన్నారు. అనుమానాస్పదంగా వస్తున్న కారును వెంబడించి సారంగపూర్‌లో పట్టుకున్నారు. కారులో రూ.60 వేలు విలువ గల 10 కలప దుంగలు లభ్యం కాగా, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌ఆర్వో తెలిపారు. కారును రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. కలప తరలిస్తున్న నిందితులు మహేశ్, నగేశ్ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు.

15 కాటన్ల దేశీదారు..



పోలీసులు పట్టుకున్న దేశీదారు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చారిగాం గ్రామంలో ఆదివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేసి దేశీదారు మద్యాన్ని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ కథనం ప్రకారం.. గ్రామంలోని పాతబడిన నిర్మానుష్య ప్రదేశంలో ఇళ్లను కేంద్రంగా చేసుకుని దేశీదారు నిల్వ చేశారని సమాచారం అందింది. అధికారులతో కలిసి తనిఖీ చేయగా రూ.55 వేల విలువ గల 15 కాటన్ల దేశీదారు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. నిందితులు డొంగ్రి మహేశ్, రితిక్ రాజు, సంతోశ్ దేవాజీపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్సై వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు

బజార్‌హత్నూర్: మండలంలోని టెంబి పంచాయతీ పరిధిలో గల చిన్నమీయ తాండ గ్రామంలో దంగర్ రాజు తన పంట చేలలో సాగు చేస్తున్న 60 గంజాయి మొక్కలను బోథ్ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టుకున్నామని ఎస్సై అప్పారావ్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దంగర్ రాజుపై కేసు నమోదు చేసుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్కడ అలా..ఇక్కడ ఇలా

- మహారాష్ట్రలోని సహస్రకుండ్ జలపాతం వద్ద రక్షణ చర్యలు
- అధికసంఖ్యలో వెళ్తున్న పర్యాటకులు
- కుంటాల వద్ద కనిపించని కనీస ఏర్పాట్లు
- ఇక్కడ పొంచి ఉన్న ప్రమాదం
- అయినా పాఠాలు నేర్వని యంత్రాంగం



సహస్రకుండ్ జలపాతం వద్ద పర్యాటకుల కోసం నిర్మించిన వంతెన



కుంటాల జలపాతం వద్ద ఎలాంటి రక్షణ లేని ప్రదేశంలో పర్యాటకులు

నేరడిగొండ: మహారాష్ట్రలోని నాందేడ్, యవత్‌మాల్ జిల్లాల సరిహద్దులో కిన్వట్ తాలుకా పరిధిలో గల ఇస్లాపూర్‌లోని సహస్రకుండ్ (సాసర్‌కుండ్) జలపాతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. వారి క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అక్కడి ప్రభుత్వం ఈ జలపాతం వద్ద రక్షణ ఏర్పాట్లు చేసింది. నిర్మల్ జిల్లా నుంచి 50 కి.మీ దూరంలో ఈ జలపాతం ఉంది. కిన్వట్, బోథ్ తాలుకాలు పక్కపక్కనే ఉంటాయి. అక్కడి సాసర్‌కుండ్ జలపాతానికి పర్యాటకులు వస్తుంటారు. కానీ పక్కనే ఉన్న మన జలపాతం వద్ద ఈ సంఖ్య కొంత తగ్గుతోంది. కానీ తెలంగాణలో ప్రాధాన్యం ఉన్న కుంటాల జలపాతం వద్ద ఇప్పటివరకు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు.

కుంటాల వద్ద సినిమా షూటింగ్

బోథ్ నియోజకవర్గ పరిధిలో గల నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం వద్ద సినిమా షూటింగ్‌లు జరిగాయి. జలపాతం దృశ్యాలు చూసేందుకు వచ్చే పర్యాటకుల కోసం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ జలపాతం అంతగా ప్రాధాన్యం లేకపోయినా తెలంగాణ టూరిజం ప్రత్యేక దృష్టిసారించింది. ఇక్కడ అభివృద్ధి కోసం ఇప్పటికే ఆ బృందం పలుమార్లు పరిశీలించింది. అయినా ఇప్పటికీ ఎలాంటి పనులు చేపట్టలేదు. టూరిజం అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు మహారాష్ట్రలోని సాసర్‌కుండ్ జలపాతం వద్దకు వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు. కుంటాలలో రోప్ వే నిర్మాణం చేపడతామని చెబుతున్నారు. జలపాతం అందాలు చూసేందుకు వచ్చే వారి కోసం సాసర్‌కుండ్ లాగే సేఫ్టీవాల్ నిర్మించాలని పర్యాటకులు కోరుతున్నారు. కుంటాల వద్ద గతంలో ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడ్డారు. అయినప్పటికీ వాటి నుంచి అధికార యంత్రాంగం పాఠాలు నేర్వడం లేదు.

అక్కడ అంతా సేఫ్టీ

సాసర్‌కుండ్‌లో జలపాతానికి వెళ్లేందుకు పిల్లర్లు తవ్వి స్లాబ్‌లు వేశారు. జలపాతం అందాలు వీక్షించేందుకు వీలుగా బండరాళ్లతో లోతుగా తవ్వి ఇనుప చువ్వలు బిగించారు. బయట నుంచి జలపాతాన్ని వీక్షించవచ్చు. టవర్‌లాగా యూ-పాయింట్ కూడా ఉండడంతో దాన్ని ఎక్కి జలపాతం అందాలను ప్రకృతి ప్రియులు వీక్షించవచ్చు.

జలపాతం పురాణగాథ

మహారాష్ట్రలోని మాహోర్ పుణ్యక్షేత్రం సమీపంలో జలపాతం ఉంది. పరుశరాముడు వేసిన బాణం వద్దే జలపాతం పుట్టిందని పురాణగాథలు చెబుతున్నాయి.

ఆరోగ్యశ్రీలో వైద్యం అందించాలి



ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న రంజిత్

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించేలా ఏర్పాటు చేయాలని మంచిర్యాలకు చెందిన తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ కోరారు. ఆదిలాబాద్‌లో ఎంపీ గోడం నగేశ్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల్లో వారికి రక్తం ఎక్కించే కేంద్రాలు ప్రారంభించేలా చూడాలన్నారు. కేంద్రం డిజిబులిటీ బిల్ 2016లో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులను దివ్యాంగులుగా గుర్తించింద ని, 2018లో జీవో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా అమలు చేయలేదన్నారు. వ్యాధిగ్రస్తులకు ఇంజక్షన్లు, బోన్ మారో మార్పిడి, ఆరోగ్యశ్రీలో చేర్పించి ఆదుకోవాలని కోరారు.

ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్స్ డే



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ



హాజరైన విద్యార్థులు


భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆదివారం ఇంజనీరింగ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ ఇక్కడ చదివే విద్యార్థులు కొత్త ప్రాజెక్టులు పరిశోధనలు చేయాలన్నారు. ఇంజనీరింగ్‌లో భాగమైన కృత్రిమ మేధ, డ్రోన్ టెక్నాలజీ, రిమోంట్ సెన్సింగ్ ఆధారంగా యువత సాంకేతికతను అందిపుచ్చుకునే విషయాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులంతా ఇంజనీరింగ్ డే ఆకారంలో హ్యూమన్‌చైన్ నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రణధీర్‌సాగి, అసోసియేట్ డీన్ డా. పావని, డా. చంద్రశేఖర్‌తోపాటు పలువురు విద్యార్థులు, ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

చింతచెట్టుపై దుర్గమ్మ రూపం

- నవరాత్రి ఉత్సవాలు అక్కడే నిర్వహించాలని గ్రామస్తుల నిర్ణయం



పూజలు చేస్తున్న భక్తులు



చెట్టుపై వెలిసిన దుర్గమ్మ రూపం

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఓ చింతచెట్టుపై ఆదివారం దుర్గమ్మ రూపాన్ని భక్తులు గుర్తించారు. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అమ్మవారికి పూజలు చేసేందుకు బారులు తీరారు. వానల్‌పాడ్ గ్రామానికి సమీపంలోని ఎల్లమ్మ గుట్ట ఉంది. ఏటా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ గుట్ట వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తుంటారు. రెండు రోజులపాటు జాతర కూడా కొనసాగుతుంది. ఈ ఏడాది గుట్టపై దుర్గమ్మ విగ్రహం ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయించారు. అందులో భాగంగా భూమి చదును చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం గుట్టపైకి వెళ్లిన యువకులు రాజు, మురళికి చింతచెట్టు కాండంపై దుర్గమ్మ ఆకృతి కనిపించింది. విషయాన్ని వారు గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లారు. స్థానికులంతా అక్కడికి చేరుకుని మంగళహారతులు ఇచ్చి పూజలు చేశారు. గంటల వ్యవధిలోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గ్రామస్తులు సైతం నవరాత్రి ఉత్సవాలకు స్వయంభూగా వెలసిన అమ్మవారికి పూజలు చేయాలని గ్రామస్తులు నిర్ణయించారు.

ఆలయాలన్నీ అక్కడే..

వానల్‌పాడ్ గ్రామంలో ఎల్లమ్మ గుట్టపై మొదట గుడి నిర్మించి ఎల్లమ్మ తల్లిని ప్రతిష్టించారు. పక్కనే దత్తాత్రేయస్వామి మందిరం నిర్మించారు. ఇక గ్రామంలోని యువకులు అయ్యప్ప, హనుమాన్ దీక్షలు స్వీకరిస్తుండగా.. వారికోసం సన్నిధానం నిర్మించారు. గుట్టకు వెళ్లే ప్రాంతంలో 41 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ గుట్టపై శివాలయం కూడా ఉంది. తాజాగా అక్కడే ఉన్న చింత చెట్టుపై భక్తులకు దుర్గమ్మ ఆకృతి కనిపించింది.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి



గణేశ్ శోభాయాత్రలో నృత్యం చేస్తున్న రాకేశ్



మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న ఈతగాళ్లు

- ప్రమాదవశాత్తు నీటమునిగి యువకుడు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని వర్తమన్నూర్ గ్రామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. పిప్రి సమీపంలో ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి యువకుడు మృతిచెందాడు. ఎస్సై అప్పారావ్ కథనం ప్రకారం.. వర్తమన్నూర్‌కు చెందిన ఆరెల్లి సుధాకర్-రాజమణి దంపతుల కుమారుడు రాకేశ్(25).. గ్రామంలో జరిగిన గణేశ్ నిమజ్జనం శోభాయాత్రలో పాల్గొని నృత్యం చేశాడు. సాయంత్రం పిప్రి సమీపంలోని నీటి కుంటలో వినాయకుని ప్రతిమను నిమజ్జనం చేశారు. అందరూ ఇంటికెళ్లిన తర్వాత రాత్రయినా రాకేశ్ ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఉదయం బజార్‌హత్నూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనుమానంతో నిమజ్జన ప్రాంతంలోని నీటికుంటలో గజఈతగాళ్లతో వెతకగా రాకేశ్ శవమై తేలాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్తను చంపిన అల్లుడు ఆత్మహత్య



వెంకటేశ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని చున్నంబట్టీవాడలో గత జూలై13న అత్తను చంపిన అల్లుడు గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక సీఐ బన్సిలాల్ కథనం ప్రకారం.. కుటుంబ కలహాలతో శాతం వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో అత్త నెల్లి విజయను భార్య మాళవిక కళ్లముందే కత్తితో విచక్షణ రహితంగా పొడిచి హత్యచేశాడు. అదే కత్తితో వెంకటేశ్ గొంతు కోసుకోవడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వెంకటేశ్‌పై హత్యకేసు నమోదు చేశారు. ఆసుపత్రి నుంచి కోలుకుని తప్పించుకుని జగిత్యాలలో బంధువుల ఇంటికి పారిపోయేందుకు యత్నించాడు. సమాచారం అందుకున్న పోలీసులు గతనెల 2న రిమాండ్‌కు తరలించారు. ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. అత్తను చంపినందుకు జైలు శిక్ష పడుతుందని మనస్తాపం చెంది ఆదివారం గోదావరిఖని వైపున గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్‌రావును వివరణ కోరగా వెంకటేశ్ ఆత్మహత్య చేసుకున్నది వాస్తవమని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నస్పూర్ ఫ్లడ్‌కాలనీకి చెందిన మాదర బోయిన శ్రీనివాస్ (36) కూలీ పనిచేసేవాడు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా శ్రీనివాస్ ఎలాంటి పనిచేయడం లేదు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం తెల్లవారుజాము రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలో మద్రాస్-జోద్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య శశికళ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మంచిర్యాల జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడికి కుమార్తె అన్విత(8) ఉన్నారు.

మతిస్థిమితం లేక మహిళ..

వేమనపల్లి: మండలంలోని ముల్కలపేటకు చెందిన మానసిక వికలాంగురాలు ఆకుల అంకు (40) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ కథనం ప్రకారం.. అంకు మతిస్థిమితం లేక తరచూ తన తల్లిని గుర్తు చేసుకుంటూ పిచ్చిపిచ్చిగా మాట్లాడేది. ఈనెల 20న ఇంట్లో ఉరివేసుకోగా గమనించిన తమ్ముడు అశోక్‌గౌడ్ ఆమెను కాపాడాడు. ఆదివారం ఉదయం ఇంట్లో దూలానికి చున్నీతో ఉరేసుకుంది. మృతురాలి అన్న చూసి తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే చనిపోయి ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలుజారి కిందపడి వ్యక్తి మృతి

భైంసారూరల్: ఓ ఇంట్లో శుభకార్యానికి వెళ్లిన వ్యక్తి కాలు జారి కిందపడి మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు..మండలంలోని కోతల్‌గాం గ్రామానికి చెందిన ఆమెడ గజ్జన్న (53) శనివారం రాత్రి పక్కనే ఉన్న ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. భోజనాలు చేయడానికి మొదటి అంతస్తుపైకి వెళ్లాడు. ఈక్రమంలో కాలుజారి కిందపడిగా తలకు తీవ్రగాయమైంది. కుటుంబీకులు వెంటనే భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వృద్ధుడు..



రాజమల్లు మృతదేహం

ఖానాపూర్: విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతిచెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పాత ఎల్లాపూర్‌కు చెందిన మేకల రాజమల్లు (63) ఆదివారం ఉదయం ఇంట్లో తెగిపోయిన విద్యుత్ వైర్ సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురయ్యాడు. ఇంటి పక్క నుంచి పశువుల పాకకు వెళ్లేమార్గంలో కరెంట్ వైర్ తెగిపోయి ఉండడంతో దాన్ని జాయింట్ చేస్తుండగా షాక్‌తో కిందపడిపోయాడు. కుటుంబీకులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందారని నిర్ధారించారు. భార్య గంగవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

ఆశోక్‌యాదవ్‌కు సేవారత్న అవార్డు



సన్మానిస్తున్న అప్పారావు, పలువురు

భీమారం: మండలంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము ఆశోక్ యాదవ్‌కు సేవారత్న అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని కోఠి సాంస్కృతిక భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు. ఆదర్శకళా నిలయం 28వ వార్షికోత్సవం సందర్భంగా చైర్మన్ చీరాల ప్రకాశ్, ఐపీఎస్ అధికారి మోహన్‌రెడ్డి, జబర్దస్త్ టీం అప్పారావు, వినోద్, వనీన్ ఆయనకు ఈ అవార్డు అందించి సన్మానించారు. సమాజంలో పలు సేవ కార్యక్రమాలు చేపడుతున్న అశోక్‌యాదవ్‌కు ఈ అవార్డును అందించారు.

అలరించిన కవిసమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీకృష్ణవేణి పాఠశాలలో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆ ధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. ఇటీవల మరణించిన డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ సాహిత్యంపై సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు ప్రసంగం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జన్మించిన కృష్ణ కవి, సినీగేయరచయితగా వెయ్యికి పైగా లలిత గీతాలను రచించిన విషయాన్ని గుర్తు చేశా రు. అనంతరం గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకొని కవులు మలయశ్రీ, శ్రీలక్ష్మి, సంతోష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కవితాగానం చేశారు.

కొత్త హక్కు పుట్టించాం..



మాట్లాడుతున్న మేకల దాసు

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల కు సైతం లాభాల వాటా హక్కు పుట్టించామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు తెలిపారు. శ్రీరాంపూర్ ఓసీపీలోని ఓబీ కార్మికులతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడారు. తొలిసారిగా కంపెనీ లాభాల నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5వేల లాభాల బోనస్ ఇప్పిస్తున్నామని, ఇది చారిత్రాత్మక ఒప్పందమన్నారు. గతంలో కూడా పర్మినెంట్ కార్మికులకు లాభాల వాటా హక్కు పుట్టించింది ఏఐటీయూసీ అని అన్నారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, నర్సింగ్, రాజేశ్, వేణు, రమేశ్, తిరుపతి ఉన్నారు.

‘లాభాల వాటాపై కార్మికుల కన్నెర్ర’



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

మందమర్రిరూరల్: సింగరేణికి గత ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల వాటా పంపిణీపై కార్మికులు కన్నెర్ర జేశారని, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలపై అసంతృప్తితో ఉన్నారని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన రూ.4,701 కోట్ల లాభాల్లో ఎలాంటి కోత లేకుండా 33 శాతం కార్మికులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వచ్చిన లాభాల్లో రూ. 2,281 కోట్లు సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెట్టడం రాజకీయ మామూళ్లే అని పేర్కొన్నారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సుదర్శన్, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ముఖేష్, థామస్, సదానందం పాల్గొన్నారు.

బతుకమ్మ కానుక చీరల పంపిణీ

నస్పూర్: పట్టణంలోని సీసీ కార్నర్ వద్ద కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బతుకమ్మ కానుకగా డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆదివారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండగకు ఏటా రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో చీరలు అందిస్తున్నట్లు తెలిపారు.





అడవిలో అందాల లోగిలి



ఆకుపచ్చని అడవిలో ఏర్పాటు చేసిన ఓ పార్కు ఆహ్లాదానికి చిరునామాగా నిలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ మండలం చింతగూడ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గులాబ్‌సింగ్ పార్కు చూపరులను ఆకట్టుకుంటుంది. సెలవుల సమయంలో విహారానికి, చిన్నపాటి ఫంక్షన్లకు కేరాఫ్‌గా నిలుస్తోంది. 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన పార్కులో అందమైన నిర్మాణాలు చూపరుల మనస్సు దోచేస్తుంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్